క్లుప్తంగా

గర్భిణులకు వైద్య పరీక్షలు



వివరాలు నమోదు చేస్తున్న ఆరోగ్య కారదర్శి

విశాఖ విద్య: బుచ్చిరాజుపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. సచివాలయ ఆరోగ్య కార్యదర్శి శివలక్ష్మి ఆధ్వర్యంలో కేంద్రం పరిధిలోని గర్భిణులు, బాలింతలకు ఆరోగ్యపరమైన సలహాలు, సూచనలు అందించారు. ఆరోగ్య పరమైన ఎలాంటి సమస్య ఎదురైనా సకాలంలో బుచ్చిరాజుపాలెం యూపీహెచ్‌సీకి తరలిరావాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త పద్మావతి, ఆశ కార్యకర్త మేరి పాల్గొన్నారు.

18న సుబ్రహ్మణ్య షష్టి మహోత్సవాలు



షష్టి మహోత్సవాల ఏర్పాట్లపై మాట్లాడుతున్న గణబాబు

గోపాలపట్నం : గోపాలపట్నం ప్రశాంతినగర్ శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి షష్టి మహోత్సవాలను ఈ నెల 18న నిర్వహించేందుకు ఆలయ కమిటీ నిర్ణయించింది. ఈ మేరకు మంగళవారం నిర్వహించిన కమిటీ సమావేశంలో పైడితల్లి అమ్మవారి ఆలయ ధర్మకర్త, ఎమ్మెల్యే గణబాబు మాట్లాడుతూ ఉత్సవాల్లో భక్తుల సౌకర్యాలకు తొలి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. 18న శ్రీవల్లీ దేవసేన సుబ్రహ్మణ్య స్వామి కల్యాణం, అన్నసమారాధన, ఊరేగింపు ఉంటాయని తెలిపారు. 17 నుంచి ఉత్సవాలు ప్రారంభమవుతాయని, 18తో ముగుస్తాయన్నారు. ఆలయ కమిటీ సభ్యులు గంర్రెడ్డి పెదబాబు, చందన గాంధీ, నారిపిన్ని సత్తిరాజు, దాడి రమేష్‌నాయుడు, మూర్తి పటాన్నయక్ తదితరులు పాల్గొన్నారు.

24న మెగా జాబ్‌మేళా

కంచరపాలెం: స్థానిక జిల్లా ఉపాధి కార్యాలయం నేషనల్ కెరీర్ సర్వీస్ సెంటర్‌లో క్లరికల్, టెక్నికల్ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 24న మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఎంప్లాయ్‌మెంట్ అధికారి సీహెచ్ సుబ్బిరెడ్డి (క్లరికల్) ఒక ప్రకటనలో తెలిపారు. హెటిరో డ్రగ్స్, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్, టీమ్ లీజ్, శరణ్ మోటార్స్, మెడ్ ప్లస్, ఫ్లిప్ కార్ట్, ఆడెకో, లాస్య ఇంజినీరింగ్ సొల్యూషన్స్, ఎస్‌వీవీ ఇన్ఫోటెక్, వీల్స్ మార్ట్, వైఎస్‌కే ఇన్ఫోటెక్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీల్లో 775 ఖాళీల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారని తెలిపారు. జూనియర్ కెమిస్ట్, ఆఫీసర్, రిటైల్ ట్రైనింగ్ అసోసియేట్, ఫార్మసిస్ట్, జూనియర్ ట్రైనీ, డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూటివ్స్, ఫీల్డ్ సేల్స్ ఎగ్జిక్యూటివ్స్, ఆఫీస్ అసిస్టెంట్, అకౌంట్స్, టెలికాలర్, రికవరీ, క్లర్క్, బ్రాంచి ఇన్‌చార్జి, ఎగ్జిక్యూటివ్స్, సీఆర్‌ఈ ఉద్యోగాలకు టెన్త్, ఇంటర్, ఐటీఐ, డిప్లమో, ఏదైనా డిగ్రీ, పీజీ, ఉత్తీర్ణత సాధించిన 18 నుంచి 45 సంవత్సరాల మధ్య వయసు కలిగిన పురుష, మహిళా అభ్యర్థులు అర్హులని తెలిపారు. కంచరపాలెం జిల్లా ఉపాధి కార్యాలయంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు జాబ్‌మేళాకు రావాలని కోరారు.

గిరిజనుల సమగ్రాభివృద్ధికి కృషి

కొమ్మాది: గిరిజనుల సమగ్ర అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని సీఈఎస్‌ఎస్ ప్రొఫెసర్ గోపీనాథ్ రెడ్డి అన్నారు. గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జనజాతీయ గౌరవ దివస్ – గిరిజన స్వాభిమాన ఉత్సవాల్లో భాగంగా మంగళవారం రుషికొండలో గల గిరిజన సాంస్కృతిక పరిశోధన శిక్షణా మిషన్ భవన్‌లో ఆయన ప్రసంగించారు. గిరిజన ఉప ప్రణాళికకు కేటాయించిన నిధులను సక్రమంగా వినియోగించుకోవాలని, ఐటీడీఏ పరిధిలోని అధికారులకు శిక్షణ ఇవ్వాలని సూచించారు. మిషన్ డైరెక్టర్ ఈసా రవీంద్రబాబు, ఈడీ చినబాబు, మిషన్ సిబ్బంది వెంకటేశ్వరరావు, శంకరరావు, శ్రీనివాస్, నాగార్జున పాల్గొన్నారు.



నాడు: ఎదురవానిపాలెంకి వెళ్లే మార్గం దుస్థితి



నేడు : రూ.80 లక్షలతో వేసిన బీటీ రోడ్డు

ప్రగతి బాట

- రూ.14 కోట్లతో అభివృద్ధి పనులు
- 58వ వార్డు రోడ్లకు మహర్దశ
- తీరిన ప్రజల రహదారి కష్టాలు



జీవీఎంసీ 58వ వార్డు రూపు రేఖలు మారుతున్నాయి. 2019కి ముందు ఈ వార్డులో రహదారుల పరిస్థితి చూసిన ప్రజలు... ప్రస్తుత అభివృద్ధి చూసి హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. 2019 తర్వాత ఇక్కడ సుమారు రూ.14 కోట్లతో వివిధ ప్రాంతాల్లో వివిధ అభివృద్ధి పనులు జరగడంతో అంతా సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

–మల్కాపురం



నాడు: శ్రీనివాస్‌నగర్ సీసీ రోడ్డు పరిస్థితి

58వ వార్డులో 2021 నుంచి 2023 ఆగస్టు వరకు చేపట్టిన కొన్ని అభివృద్ధి పనులు క్లుప్తంగా..

గుల్లలపాలెం ప్రధాన డ్రైన్ (కాలువ) నిర్మాణం రూ. 1.50 కోట్లు	గొందేశివానిపాలెంలో బీటీ రోడ్డు నిర్మాణం రూ. 25 లక్షలు
ఎదురవానిపాలెంలో సీసీ రోడ్డు నిర్మాణం రూ. 80 లక్షలు	శ్రీనివాస్‌నగర్ నుంచి శ్రీహరిపురం వరకు సీసీ రోడ్డు రూ. 75 లక్షలు
ములగాడ,ఉప్పరకాలనీ వద్ద సీసీ రోడ్డు నిర్మాణం రూ. 52 లక్షలు	ములగాడ కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణం రూ. 17 లక్షలు



నేడు : రూ.75 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు

గతంలో ఇంత అభివృద్ధి లేదు



గతంలో ఎన్నడూ లేని విధంగా మా గ్రామంలో ఇప్పుడు అభివృద్ధి పనులు చేపట్టారు. సుమారు రెండు కోట్ల రూపాయిలతో వివిధ అభివృద్ధి పనులను ప్రభుత్వం చేపట్టింది. చాలా ఆనందంగా ఉంది. గతంలో గుంతలు పడ్డ రోడ్లు,పిక్క తేలిన మార్గాలు ఉండేవి. నేడు అద్దంలా మెరిసే రోడ్లు, ఆస్పత్రి నిర్మాణంతో పాటు కొండ ప్రాంతంలో రక్షణ గోడలు ఇలా అనేక పనులు మా గ్రామంలో జరిగాయి. –సింగంపల్లి ఎరుకునాయుడు, ఎదురవాని పాలెం

అభివృద్ధి చూపించారు



ఎన్నడు లేని విధంగా మా గ్రామంలో ప్రస్తుత ప్రభుత్వం అనేక అభివృద్ధి పనులు చేపట్టారు.గతంలో కనీస వసతులు లేక ఇబ్బందులు పడేవాళ్లం. గతుకుల రోడ్లు ఉండేవి. ప్రస్తుతం సీసీ రోడ్లు, జీవీఎంసీ పాఠశాలను నాడు-నేడులో అభివృద్ధి చేశారు. సామాజికభవనం ఏర్పాటుతో పాటు గెడ్డలు ఆధునీకరించి ముురుగు కష్టాలకు చెక్ పెట్టారు.

– పిలక సూర్యప్రసాదరెడ్డి, పిలకవానిపాలెం

హామీలు నెరవేరుస్తున్నాం



కార్పొరేషన్ ఎన్నికల ప్రచార సమయంలో వార్డు ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రాధాన్యత ప్రకారం నెరవేరుస్తున్నాం. గత పాలకులు అధ్వానంగా ఉన్న రోడ్లను పట్టించుకోలేదు. దీంతో ప్రజల ఇబ్బందులను గుర్తించి రోడ్లు అభివృద్ధి చేశాం. వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ సహకారంతో గడిచిన కాలంలో రూ .14 కోట్లతో వార్డులో అభివృద్ధి పనులు చేసి చూపించాం. మరిన్ని పనులు వివిధ దశల్లో ఉన్నాయి. –గులిగిందల లావణ్య, 58వ వార్డు కార్పొరేటర్

సంక్షేమ సారథి సీఎం జగన్



ఇందిరానగర్‌లో పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న బెహరా భాస్కరరావు

గోపాలపట్నం: అర్హతే ప్రాతిపదికగా పేదలకు సంక్షేమ పథకాలను అమలు చేస్తూ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి సంక్షేమ సారథిగా నిలిచారని జీవీఎంసీ కో- ఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు అన్నారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా పాలన అందిస్తున్నారన్నారు. ఈ సంక్షేమపాలన కొనసాగాలని ప్రజలు కోరుకుంటున్నారని, అందుకే ఆయన మళ్లీ ముఖ్యమంత్రి కావాలనే అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. 92వ వార్డు ఇందిరానగర్‌లో నిర్వహించిన ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే.. కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తొలుత ఇక్కడ పార్టీ జెండాను ఆవిష్కరించారు. సచివాలయ పరిధిలో ప్రజలకు మంజూరైన సంక్షేమ పథకాలను తెలియజేసే డిజిటల్ బోర్డును ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ చంద్రబాబు, పవన్ కల్యాణ్ పార్టీలకు అధికారం వస్తే జలగలు పుట్టుకొస్తాయని, ప్రజల రక్తాన్ని పీల్చితాగుతాయని హెచ్చరించారు. ప్రస్తుతం ప్రభుత్వ పథకాల నగదు నేరుగా లబ్ధిదారుల ఖాతా ల్లోకే వస్తోందన్నారు. ఎక్కడా అవినీతి లేకుండా, పారదర్శకంగా పాలన సాగుతోందన్నారు. దీనిని కొనసాగించుకునేందుకు జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రి చేసుకుందామన్నారు. ఆ బాధ్యత అందరిపై ఉందన్నారు.

రూ.17.87 కోట్ల లబ్ధి: ఈ సచివాలయం పరిధిలో ప్రభుత్వ పథకాల ద్వారా రూ17.87కోట్లు వెచ్చించారని భాస్కరరావు తెలిపారు. రహదారులు, కాల్వల అభివృద్ధికి గడపగడపకు మన ప్రభుత్వం ద్వారా రూ.20లక్షలు వెచ్చించామని తెలియజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు అప్పలస్వామి నాయుడు, గుణిశెట్టి శ్రీనివాసరావు, జేసీఎస్ క్లస్టర్ ఇన్‌చార్జి గేదెల మురళీ కృష్ణ, బండారు వరలక్ష్మి, కె.త్రినాథరావు, కె.రామకృష్ణ, సుందర్, గణేష్ దాసిరి శ్రీను, బి.శ్రీను, తాతారావు పాల్గొన్నారు.

మత్స్యకారులకు న్యాయం చేయాలి

మహారాణిపేట: మత్స్యకారులకు తక్షణం నష్ట పరిహారం చెల్లించాలని మాజీ మంత్రి కొల్లు రవీంద్ర కోరారు. ఫిషింగ్ హార్బర్‌లో జరిగిన అగ్ని ప్రమాద స్థలాన్ని మంగళవారం సందర్శించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నష్టపోయిన మత్స్యకారులకు న్యాయం చేయాలన్నారు. హార్బర్ చరిత్రలో ఇంత పెద్ద ప్రమాదం జరగడం ఇదే మొదటి సారి అని మాజీ మంత్రి, ఉత్తర ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కొండబాబు, గండిబాబ్జీ పాల్గొన్నారు.

సరకు రవాణాలో లక్ష్యాలు చేరుకోవాలి



మాట్లాడుతున్న డీఆర్‌ఎం సౌరభ్ ప్రసాద్

తాటిచెట్లపాలెం : సరకు రవాణాలో నిర్దేశించిన గమ్యాలు చేరుకునేందుకు అంతా సమష్టి కృషితో పనిచేయాలని డీఆర్‌ఎం సౌరభ్ ప్రసాద్ అన్నారు. దొండపర్తిలోని డివిజనల్ రైల్వే మేనేజర్ కార్యాలయంలో మంగళవారం అధికారులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శక్తివంతమైన నిర్ణయాలు, ఖర్చు ఆదా చేసే వివిధ పద్ధతులు అనుసరించి గమ్యాలు చేరుకోవాలన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని పరిశ్రమలకు అవసరమైన రేక్‌లను సమకూరుస్తూ, త్వరితగతిన డబ్లింగ్ పనులను పూర్తిచేస్తూ వాల్తేర్ డివిజన్ ముందుకు సాగుతోందన్నారు. ప్రత్యేకంగా ముడి ఇనుము సరఫరాకు గతేడాది కంటే సుమారు 25శాతం రేక్‌లను పెంచినట్లు తెలిపారు. సమావేశంలో వాల్తేర్ డివిజన్ వ్యాపార భాగస్వాములైన నేషనల్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్‌ఎండీసీ), వైజాగ్ స్టీల్‌ప్లాంట్, గంగవరం పోర్టు, కుద్రేముఖ్ ఐరన్ అండ్ స్టీల్ కంపెనీ, జిందాల్ స్టీల్ సంస్థల నుంచి ప్రతినిధులతో పాటు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ ఆపరేషన్స్ మేనేజర్ జి.సునీల్‌కుమార్, ఆపరేషన్స్, ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

ఓటరు జాబితాలపై ఫోకస్

- డూప్లికేట్ ఓట్ల లెక్క తీస్తున్న అధికారులు
- రెండు ఓట్లు ఉన్న 12,017 మంది గుర్తింపు
- వారి ఇంటి అడ్రస్‌కు పోస్టు ద్వారా నోటీసు
- ఎక్కడ ఓటు కావాలో ధృవీకరణ ఇవ్వాల్సిందే



నోటీసులు సిద్ధం చేస్తున్న సిబ్బంది

విశాఖ విద్య: ఓటరు జాబితా తయారీపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. అర్హులకు ఓటు హక్కు కల్పించటంతో పాటు, బోగస్ ఓట్లు లేకుండా ఆర్‌డీవో హుస్సేన్ సాహెబ్ యంత్రాంగంతో రోజువారీ సమీక్ష చేస్తున్నారు. దీనిలో భాగంగా అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు, పశ్చిమ నియోజకవర్గంలోని రాజకీయ పార్టీలతో మంగళవారం గోపాలపట్నం తహసీల్దార్ కార్యాలయంలో సమావేశమయ్యారు. నియోజకవర్గంలో మొత్తం 2,21,340 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 1,10,015 మంది కాగా, మహిళా ఓటర్లు 1,11,307 మంది ఉన్నారు. అదే విధంగా ఇతరులు (థర్డ్ జండర్) 18 మంది ఉన్నట్లు ప్రకటించారు.

రెండు చోట్ల ఓటు ఉంటే నోటీసు జారీ

ఒకే వ్యక్తికి రెండు అంతకంటే ఎక్కువ పోలింగ్ స్టేషన్లలో ఓటు హక్కు ఉన్న వారిని గుర్తించారు. పశ్చిమ నియోజకవర్గంలోని 220 పోలింగ్ స్టేషన్లలో ఇలా 12,017 మంది ఉన్నట్లు లెక్క తేలడంతో వారికి నోటీసులు సిద్ధం చేస్తున్నారు. ఓటరు జాబితాలో ఉన్న అడ్రస్‌కు పోస్టు ద్వారా నోటీసు పంపించనున్నారు. ఇలా నోటీసు అందుకున్న వారు, ఎక్కడ ఓటు కావాలనేది బూత్‌లెవెల్ అధికారులకు ధృవీకరణ పత్రం అందజేయాలి.

వెనక్కి వచ్చిన 4,601 నోటీసులు

ఓటరు జాబితాల పరిశీలన కోసం బీఎల్‌వోలు ఇంటింటి సందర్శన చేసినప్పుడు అందుబాటులో లేని 8,518 మందిని గుర్తించారు. జాబితాలో పేరు ఉన్నప్పటికీ స్థానికంగా ఎందుకు లేరనేది వివరణ కోరుతూ వారి ఇంటి అడ్రస్‌కు నోటీసులు పంపించారు. అయితే ఇందులో 4,601 నోటీసులు తహసీల్దార్ కార్యాలయానికి వెనుక్కి వచ్చాయి. వీరందరి పేర్లను ఓటరు జాబితా నుంచి తొలగించేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు పారదర్శకమైన ఓటరు జాబితా తయారు చేస్తున్నామని పశ్చిమ నియోజకవర్గ ఎన్నికల సెల్ డీటీ శ్రీనివాసరావు తెలిపారు.

నేటి నుంచి ఇళ్ల మరమ్మతులకు దరఖాస్తులు

- ఆన్‌లైన్‌లో అనుమతులు మంజూరు
- భక్తుల సలహాలు, సూచనల కోసం వాట్సాప్ నంబర్
- సింహాచలం దేవస్థానం ఈవో శ్రీనివాసమూర్తి



సింహాచలం దేవస్థానం సమాచారం తెలిసేలా రూపొందించిన కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఈవో శ్రీనివాసమూర్తి

సింహాచలం: ప్రభుత్వం ఇచ్చిన మెమో ప్రకారం పంచగ్రామాల భూముల్లో నిర్మించిన ఇళ్ల మరమ్మతులు చేసుకునేందుకు బుధవారం నుంచి సింహాచలంలోని కొండదిగువ శ్రీదేవి కాంప్లెక్స్‌లో దరఖాస్తులు అందజేయనున్నట్లు సింహాచలం దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి తెలిపారు. దేవస్థానం కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో ఇళ్ల రిపేర్లకు సంబంధించి తీసుకున్న చర్యలతో పాటు కొత్తగా తీసుకున్న నిర్ణయాలు, ఉత్సవాల సందర్భంగా చేస్తున్న ఏర్పాట్లను వివరించారు. ఇళ్ల రిపేర్లకు సంబంధించి ప్రభుత్వం జారి చేసిన మెమోకి లోబడే మరమ్మతులు చేసుకుంటామని దరఖాస్తుదారులు హామీ పత్రం సమర్పించాల్సి ఉంటుందన్నారు. గురువారం నుంచి వెబ్‌సైట్ ద్వారా కూడా దరఖాస్తు డౌన్‌లోడ్ చేసుకుని నింపిన తర్వాత నేరుగా అందజేయాలని తెలిపారు.

23 నుంచి స్వీకరణ

ఈనెల 23 నుంచి శ్రీదేవి కాంప్లెక్స్‌లోనే దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. వివరాలను దేవస్థానం సిబ్బంది కంప్యూటర్ నమోదు చేసుకుని దరఖాస్తుదారునికి రశీదు ఇవ్వడం జరుగుతుందన్నారు. దరఖాస్తులకు ఇచ్చిన నంబరు ప్రకారం పదిరోజుల తర్వాత అప్రూవ్ అయిందా...లేదా అని కూడా చూసుకునేలా వెబ్‌సైట్ రూపొందిస్తున్నామన్నారు. వచ్చిన దరఖాస్తుల ఆధారంగా క్షేత్రస్థాయిలో పరిశీలించిన తర్వాతే అనుమతులు మంజూరవతాయని స్పష్టం చేశారు. మెమోను సాకుగా తీసుకుని ఎలాంటి అదనపు నిర్మాణాలు చేపట్టినా దేవదాయశాఖ 1983 సెక్షన్ ప్రకారం నోటీసులు ఇచ్చి తొలగించడం జరుగుతుందన్నారు.

భక్తులకు చేరువగా సమాచారం

దేవస్థానంలో సేవలు, ఇతర సమాచారం పూర్తిగా తెలిసే విధంగా ఎనిమిది పేజీలతో రూపొందించిన కరపత్రాన్ని భక్తులందరికీ అందిస్తామని ఈవో తెలిపారు. అందులో సింహాచలం క్షేత్ర మహత్యం, దర్శనాల సమయాలు, దర్శనీయ స్థలాలు, ప్రధాన వార్షిక ఉత్సవాలు, ఆర్జిత సేవలు, ఉపాలయాలు తదితర వాటి వివరాలు ఉంటాయని చెప్పారు. కార్యక్రమంలో దేవస్థానం ఈఈలు శ్రీనివాసరాజు, రాంబాబు, డీఈ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

- భక్తుల నుంచి సూచనలు, సలహాలు స్వీకరించడానికి వాట్సాప్ నెంబర్ 9398734612ని అందుబాటులోకి తీసుకురావడం జరిగిందన్నారు.
- ఇకపై దేవస్థానంలో ఏఈవోలు, సూపరింటెండెంట్లు, పీఆర్వోకు కొత్తగా నంబర్లు కేటాయించినట్టు తెలిపారు. అధికారులు మారినా ఆనెంబరు మారదన్నారు.
- భైరవవాక రోడ్డు విస్తరణ విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లామన్నారు.
- స్వామివారి ఆర్జిత సేవలను పరోక్షంగా చేసుకునే విధంగా ఈనెల 12న స్వాతి నక్షత్రంతో మొదలు పెట్టామని చెప్పారు.
- ఈనెల 26 నుంచి 41రోజుల నృసింహ దీక్ష, డిసెంబరు 4 నుంచి 32 రోజుల నృసింహ దీక్ష ప్రారంభమవుతుందన్నారు.
- ఈనెల 27న కార్తీక పౌర్ణమి పురస్కరించుకుని సాయంత్రం 5గంటలకు కొండదిగువ వరాహ పుష్కరిణి వద్ద గంగా హారతి నిర్వహిస్తున్నట్టు తెలిపారు. భక్తులకు దేవస్థానంలో ఉన్న ఆవులపేడతో తయారు చేసిన ప్రమిదలు, నూనె దేవస్థానం ఉచితంగా అందించడం జరుగుతుందన్నారు.
- ఈనెల 27 నుంచి 29వరకు సింహగిరి క్షేత్రపాలకుడు త్రిపురాంతకస్వామి ఆలయంలో వరుణాభిషేకం నిర్వహించనున్నారు.
- డిసెంబరు 12న పోలిపాడ్యమిని పురస్కరించుని కొండదిగువ వరాహ పుష్కరిణి వద్ద గజ ఈతగాళ్లు, సెక్యూరిటీ సిబ్బందిని నియమించనున్నట్టు తెలిపారు.
- సింహగిరిపై కొత్త మండపాన్ని నిర్మించి ప్రతి శనివారం సహస్ర దీపాలంకరణ చేపట్టేందుకు ప్రణాళిక చేస్తున్నట్లు తెలిపారు. అలాగే గ్రామ గరుడసేవ కూడా ప్రారంభించే యోచన చేశామన్నారు.

ఏయూతో శ్రీలంక వర్సిటీ ఎంవోయూ

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయంతో శ్రీలంకకు చెందిన శ్రీ జయవర్ధనపుర విశ్వవిద్యాలయం అవగాహన ఒప్పందం చేసుకుంది. దీనిలో భాగంగా ఏయూలో పాలీ, బౌద్ధ అధ్యయనాలపై ఎంఏ కోర్సును ప్రారంభిస్తారు ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాదరెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య జేమ్స్ స్టీఫెన్, ఓఎస్‌డీ ఆచార్య వి.కృష్ణమోహన్, యోగా కేంద్రం సంచాలకులు ఆచార్య భానుకుమార్, అకడమిక్ డీన్ ఆచార్య కిషోర్‌బాబు, జయవర్ధన విశ్వవిద్యాలయం ఆచార్యులుమడగంపిటియే విజిత థెరో పాల్గొన్నారు.

ఆర్‌టీసీ బస్సును ఢీకొట్టిన కారు



ప్రమాద స్థలంలో ఆర్టీసీ బస్సు, కారు

గోపాలపట్నం : అతి వేగంగా ఎదురుగా వస్తున్న ఆర్‌టీసీ బస్సును కారు ఢీకొట్టిన ఘటన గోపాలపట్నం సీఎంఆర్ షాపింగ్ మాల్ వద్ద మంగళవారం సాయంత్రం చోటు చేసుకుంది. గోపాలపట్నం పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నగరం నుంచి సుజాతానగర్ వైపు వెళ్తున్న కారు గోపాలపట్నం సీఎంఆర్ షాపింగ్ మాల్ వద్ద సింహాచలం నుంచి ఆర్‌కేబీచ్‌కు వెళ్తున్న 28 హెచ్ బస్సును ఢీకొట్టింది. కారు డ్రైవర్ ముందున్న వాహనాలను ఓవర్ టేక్ చేస్తు వేగంగా రావడం గమనించిన ఆర్‌టీసీ బస్సు డ్రైవర్ పరిస్థితి గమనించి బస్సును నిలిపివేశారు. దీంతో పెను ప్రమాదం తప్పిందని ఇక్కడి వారు చెబుతున్నారు. కారు డ్రైవర్ మద్యం సేవించి ఉన్నాడు. డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్ష చేయగా 350 పాయింట్లు వచ్చినట్లు చెబుతున్నారు. కారులో ప్రయాణిస్తున్న శశికుమార్‌కు స్వల్ప గాయాలయ్యాయి. అతను స్థానిక ప్రైవేటు ఆస్పత్రిలో ప్రథమ చికిత్స తీసుకున్నారు. కారు డ్రైవర్ కల్లూరి తేజేశ్వరరావును పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ప్రమాదం జరిగిన వెంటనే గోపాలపట్నం ట్రాఫిక్ సీఐ అశోక్‌కుమార్, ఎస్ఐ శ్రీనివాసరావు ఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను నియంత్రించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రామకృష్ణానగర్‌లో చోరీ



మంచంపై చిందర వందరంగా పడేసిన బీరువాలో వస్తువులు

గోపాలపట్నం: జీవీఎంసీ 91వ వార్డు రామకృష్ణానగర్‌లో తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ జరిగింది. గోపాలపట్నం క్రైం పోలీసులు తెలిపిన వివరాలు..కోరుబిల్లి సంతోషి లక్ష్మి భర్తతో కలిసి శుక్రవారం ఇంటికి తాళం వేసి కాకినాడ వెళ్లారు. దిగువ అంతస్తులో కుమార్తె భీశెట్టి లక్ష్మి కుటుంబంతో నివసిస్తున్నారు. సోమవారం సాయంత్రం ట్యాంక్‌లో నీళ్లు ఉన్నాయో లేదో చూడడానికి పై అంతస్తులోకి వెళ్లారు. అప్పటికి ఇంటి తలుపులు బాగానే ఉన్నాయి. మంగళవారం సాయంత్రం వెళ్లేసరికి తలుపులు తెరిచి ఉండడంతో లక్ష్మి పోలీసులకు సమాచారం ఇచ్చారు. సోమవారం రాత్రి సమయంలో ఈ చోరీ జరిగినట్లుగా లక్ష్మి కుటుంబ సభ్యులు చెబుతున్నారు. ఇంట్లో సామగ్రి, బీరువాలో ఉన్న చీరలు వస్తువులు చిందరవందర చేశారు. ఇంట్లో బంగారాన్ని బ్యాంక్ లాకర్‌లో ఉంచడంతో భారీ నష్టం వాటిల్లలేదు. 3 తులాల బంగారం, రూ. 10 వేల విలువ చేసే వెండి చోరీకి గురైనట్లు బాధితులు చెబుతున్నారు. ఘటనా స్థలానికి చేరుకున్న క్రైం ఎస్ఐ సురేష్‌కుమార్ పరిశీలించారు. క్లూస్ టీం ఆధారాలు సేకరించారు. బాధితురాలు సంతోషి లక్ష్మి ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.